## క్లుప్తంగా

### కిట్స్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో సోమవారం డేటా సైన్స్ విభాగంలో అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తమిళనాడు ఐసీటీ అకాడమీ సీనియర్ టెక్నికల్ ట్రైనర్ కుమార్ గురు ఇన్నోవేటివ్ రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్‌పై వివరించారు. చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ఎఫ్‌డీపీ ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతి డాక్టర్ బి.భానుప్రకాష్, వివిధ కళాశాలల నుంచి హాజరైన అధ్యాపకులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



శారద (ఫైల్)

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పల్నాడు జిల్లా, నరసారావుపేట మండలం కోటప్పకొండ గ్రామానికి చెందిన తన్నీరు శారద (62) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కాకానిలోని చర్చికి వెళ్లేందుకు ఈ నెల 10న అదే గ్రామానికి చెందిన కేశనబోయిన వెంకటేశ్వర్లుతో కలిసి మోటార్ సైకిల్‌పై బయలుదేరింది. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు కాటూరి హాస్పిటల్ సమీపంలో కుక్క ఒక్కసారిగా ద్విచక్ర వాహనానికి అడ్డు వచ్చింది. వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో శారదా వాహనంపై నుంచి కింద పడింది. తలకు తీవ్ర గాయాలవడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున వృద్ధురాలు మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి కుమారుడు తన్నీరు శ్రీను అలియాస్ భవాని సిద్ధయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేశారు.

### వాటర్ కూలర్ బహూకరణ



ప్రత్తిపాడు: మండల పరిధిలోని కొండేపాడు ఎల్ఈ పాఠశాలకు దాతలు వాటర్ కూలర్‌ను బహూకరించారు. తిక్కిరెడ్డిపాలేనికి చెందిన సెయింట్ విన్సెంట్ డిపాల్ సొసైటీ సహకారంతో సమకూర్చిన రూ.13 వేల విలువ చేసే వాటర్ కూలర్‌ను సోమవారం సంస్థ సభ్యులు పాఠశాల హెచ్ఎం జి.చంద్రశేఖర్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సొసైటీ సభ్యులు దక్కుమళ్ల ఆనందరావు, కొండేపాటి మరియదాసు, విచారణ గురువు కిషోర్ కూలర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా కృషి చేయాలని పీఎం కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం నల్లపాడు గ్రామంలోని విద్యాలయంలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మా కె నామ్ సే ఏక్ పేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఎన్‌సీసీ క్యాడెట్స్ మొక్కలు నాటారు. ఎన్‌సీసీ ఆఫీసర్ సాయిరాం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ చేపట్టాలని చెప్పారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎస్ఆర్ రంగనాథన్ జయంత్యుత్సవం

పెదకాకాని: గ్రంథాలయోద్యమంలో షియాలీ రామామృత రంగనాథన్ ప్రముఖులని ఆయన జయంతి రోజున గ్రంథాలయ దినోత్సవం జరుపుకుంటున్నామని స్థానిక గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ గ్రంథాలయాల విశిష్టతను వివరించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ నిర్మల విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



ప్రత్తిపాడులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీపీ దాసరి అన్నమ్మ, సర్పంచ్‌లు, ఎంపీడీవో



అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళి

ప్రత్తిపాడు: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎంపీడీవో కె.దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక 2024–25పై శిక్షణ కార్యక్రమాలు జరగనున్నాయి. అందులో భాగంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తొలి రోజు ఎంపీపీ దాసరి అన్నమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీడీవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. సర్పంచ్‌లు గ్రామ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసుకుని, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరించుకోవాలన్నారు. సర్పంచ్‌లకు ఉన్న విశేషాధికారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామస్థాయిలో అందరినీ కలుపుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు.

**విధులు.. సమావేశాలపై..**

గ్రామ సర్పంచ్‌ల విధులు, సమావేశాల నిర్వహణపై ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా మొదటి రోజు శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీ పరిపాలనలో భాగంగా నిర్వర్తించాల్సిన విధులు, విధి నిర్వహణలో గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎలా పనిచేయాలి, కామన్ అడ్మినిస్ట్రేషన్ ప్రొసీజర్‌లో భాగమైన సమావేశాలు, గ్రామసభ, పర్యవేక్షణ, తనిఖీలు, ప్రజారోగ్యం కోసం పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, తడి, పొడి చెత్తను వేరుచేయడం, వర్మీ కంపోస్టు తయారీ, మార్కెటింగ్.. వంటి అనేక అంశాలపై తర్ఫీదునిచ్చారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాకుమాను: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులే కీలకమని ఎంపీడీఓ పి.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యచరణ ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో శానిటేషన్, వర్మీ కంపోస్టు మార్కెటింగ్ వంటి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. బీ.ఆర్.అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ జవహర్ లాల్ నెహ్రూ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రతి అర్జీని పరిష్కరించాలి

**తహసీల్దారు కె. రవిబాబు**



సమస్యలు వింటున్న తహసీల్దారు కె. రవిబాబు

ప్రత్తిపాడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిందేనని తహసీల్దారు కె. రవిబాబు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తొలుత అధికారులతో మాట్లాడారు. ప్రతి వారం వివిధ సమస్యలపై ఆయా శాఖలకు వచ్చే అర్జీలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆరు అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు కె. రవిబాబు తెలిపారు. పొలంలో నీరు వెళ్లకుండా పక్క పొలం రైతు అడ్డుకున్నారంటూ కొత్తమల్లాయపాలెం నుంచి ఒక రైతు, కొండేపాడు నుంచి ఒక రైతు వేర్వేరుగా అర్జీలిచ్చారు. రీ–సర్వేలో తమ భూమి విస్తీర్ణం తగ్గిందంటూ ప్రత్తిపాడుకు చెందిన ఇద్దరు రైతులు, గొట్టిపాడుకు చెందిన ఒక రైతు అర్జీ అందించారు. కాగా వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన ఏఎన్ఎంలు మరో అర్జీని దాఖలు చేసినట్లు తహసీల్దారు తెలిపారు.

# మహిళల ఆర్థిక ప్రగతికి కృషి



శిక్షణలో పాల్గొన్న మహిళలతో సంస్థ ప్రతినిధులు

గుంటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల వ్యక్తిగత, వృత్తి పరమైన ఎదుగుదల కోసం, జీవన నైపుణ్యాలతో కూడిన పేస్ కార్యక్రమాన్ని ముగించామని వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ, పేస్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సురేష్ తెలిపారు. సోమవారం ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత 30 రోజులుగా పేస్ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. రచయిత లావిన మాట్లాడుతూ పేస్ కార్యక్రమం కుట్టు పరిశ్రమలోని మహిళల సామర్థ్యాలు పెంపొందించేందుకు రూపొందించినట్లు తెలిపారు. గ్యాప్ ఇంక్ కుటీర పరిశ్రమలో 2007లో నలుగురు మహిళలతో ప్రారంభమై నేడు 24 దేశాల్లో 13 లక్షల మంది మహిళలకు చేరుకుందని వివరించారు. శిక్షణ పొందిన మహిళలు ఆత్మవిశ్వాసంతో వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో సమర్థంగా రాణించగలుగుతున్నారని చెప్పారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ బ్రైజేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నీరు, పారిశుధ్యం కోసం తమ వంతు సహాయాన్ని సంస్థ ద్వారా అందిస్తామన్నారు. సంస్థ ప్రతినిధులు సాయి, సునీల్ కుమార్, వేణు అంగన్వాడీ కార్యకర్తలు సీతామహాలక్ష్మి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

# గొట్టిపాడు ఎస్ఎంసీ ఎన్నిక ఘటనపై ఫిర్యాదు

ప్రత్తిపాడు: గొట్టిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మళ్లీ ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని ఎస్సీ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయని, తొలుత చైర్మన్‌గా ఎన్నికైన దళిత మహిళను పక్కనబెట్టి, గ్రామానికి చెందిన కొంతమంది ప్రోద్బలంతో రెండోసారి ఎన్నికలు జరిపి, ఓసీని చైర్మన్‌గా ఎన్నుకున్నారని అందులో పేర్కొన్నారు. స్కూల్లో సుమారు 350 మంది విద్యార్థులుండగా.. వారిలో 250 మంది దళిత విద్యార్థులేనని తెలిపారు. దళిత మహిళను చైర్మన్‌గా ఎన్నుకుంటే ఓర్వలేకనే రెండోసారి ఎన్నికలు జరిపారని పేర్కొన్నారు. ఎన్నిక జరిగిన తీరు సక్రమంగా లేదని, భయభ్రాంతులకు గురిచేసేలా ఉందని, స్కూల్లో దళిత పిల్లలకు రక్షణ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాలలో మరలా ఎన్నికనైనా జరిపించాలని, లేదా పిల్లలకు టీసీలిస్తే రక్షణ ఉన్న పాఠశాలలో చేర్పించుకుంటామని ఫిర్యాదులో విన్నవించినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

### ఆలయ హుండీల లెక్కింపు

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి దేవస్థానం హుండీలను లెక్కించగా రూ.7.80.854 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ టి.శ్రీనివాస్ తెలిపారు. బాపట్ల ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్యామల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది 45 రోజులకు సంబంధించిన 20 హుండీలను లెక్కించారని వివరించారు.

### కర్రసాము పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి కర్రసాము పోటీల్లో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని స్కూల్లో సోమవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిలంబం స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలో అండర్–17 విభాగంలో తమ విద్యార్థి ఆర్. డార్విన్, అండర్–14 విభాగంలో సీహెచ్ చైతన్య, డి. చిన సూర్య, పి. అస్మా, కె.సాయి సహస్ర, ఎం. మోక్షిత్, అనుదీప్, రితివిక్ సంజయ్, తేజశ్వర్, మనోహర్, రేవంత్, సాత్విక్, పాల్ చైతన్య బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు వివరించారు. డబుల్ స్టిక్స్ ఫైటింగ్ అండర్–14 విభాగంలో రేవంత్, అండర్–11లో వసంత్ బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. కర్రసాము ద్వారా ఆత్మరక్షణతో పాటు శక్తి, సూక్ష్మబుద్ధి అలవడతాయని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి. రత్తయ్య మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యమివ్వాలనే లక్ష్యంతో చివరి పీరియడ్‌లో 16 యాక్టివిటీస్‌ను కరిక్యులమ్‌లో జత చేసి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

# ఎంపీడీవోకు ఘనంగా వీడ్కోలు



ఎంపీడీవో దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ అన్నమ్మ, సిబ్బంది

ప్రత్తిపాడు: ఎంపీడీవో కె.దుర్గాప్రసాద్‌కు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరి 1న కోలవెంటి దుర్గాప్రసాద్ ఎన్టీఆర్ జిల్లా నుంచి బదిలీపై ప్రత్తిపాడుకు వచ్చారు. ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులివ్వడంతో సోమవారం రిలీవ్ అయ్యారు. ఎంపీపీ దాసరి అన్నమ్మ, చెంచురామారావుతో పాటు స్థానిక సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఎంపీడీవోకు ఘనంగా వీడ్కోలు పలికారు. దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అత్యంత కీలకమైన ఎన్నికల సమయంలో సమర్థంగా విధులను నిర్వర్తించడానికి సహకరించిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ రామకోటయ్య, ఏఈలు, సెక్రటరీలు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉంటాం



ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు



ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్స్, యాజమాన్యం

గుంటూరు రూరల్: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని కల్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో డ్రగ్స్ రహిత ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మత్తుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల ఎన్నో జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. పొగాకు, గుట్కాలు, మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు బానిసలు కాకుండా నాషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, ప్రొఫెసర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**మత్తుతో జీవితం నాశనం**

గుంటూరు రూరల్: మత్తు మానవ జీవితం నాశనానికి మార్గమని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య పేర్కొన్నారు. గోరంట్ల గ్రామంలోని కళాశాలలో నషా ముక్త భారత్ అభియాన్–2024 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థినులు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. వారితో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల పీడీ జి.బాలశౌరిరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ సుస్మిత, డి.సైమన్, ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే యాంటి ర్యాగింగ్ ర్యాలీని కళాశాలలో నిర్వహించారు. విద్యార్థినులు సే నో టు ర్యాగింగ్, జాయ్ ఫుల్ కాలేజ్ లైఫ్ అంటూ నినాదాలు చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు ప్రిన్సిపల్ హెచ్చరించారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు కథనం మేరకు.. సంగంజాగర్లమూడికి చెందిన రామిశెట్టి లక్ష్మమ్మ(80) ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు రాగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించగా మృతి చెందింది. సోమవారం సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# టీచర్ల సర్దుబాటు నిబంధనలు సవరించాలి: ఫ్యాప్టో

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలు సవరించి ప్రాథమిక విద్యను కాపాడాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ ఎం.కళాధర్ కోరారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖాధికారులకు సోమవారం డిమాండ్లతో కూడిన లేఖలు అందజేశారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ 3,4,5 తరగతుల విలీనంతో అనేక ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితుల్లోకి వచ్చాయని తెలిపారు. ప్రస్తుత ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలు అదే విధంగా ఉండి మరిన్ని పాఠశాలలు మూతబడే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలు మూతపడితే భవిష్యత్తులో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఏ విధంగా చేరతారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రవేశాలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే సర్దుబాటు నిబంధనలు సవరించాలని కోరారు. ఉన్నత పాఠశాలలకు సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించడంతోపాటు ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలన్నారు.

# చిత్రకళా నైపుణ్యంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలి



చిత్రకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మధుసూదనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: చిత్రకళా నైపుణ్యంతో జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మధుర్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్వాతంత్ర్య సమరయోధుల పెన్సిల్ పోట్రెయిట్ చిత్రకళా ప్రదర్శన సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ చిత్రాలను గీసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, విశ్రాంత ఎస్పీ చెన్నంశెట్టి చక్రపాణి, ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య, గ్రంథ పాలకులు కె. చిన్నపరెడ్డి, ఎస్. నాగిరెడ్డి, మద్దినేని సుధాకర్, మధుర్ ఆర్ట్ స్కూల్ వ్యవస్థాపకుడు పి. మధుసూదనరావు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

పొన్నూరు: ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలపై స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఇన్‌చార్జ్ తహశీల్దార్ ఇ.ప్రశాంతి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి 11 అర్జీలను స్వీకరించారు. మాచవరం, నిడుబ్రోలు, ములుకుదురు, మునిపల్లె, గ్రామాలకు చెందిన ప్రజలు ఇంటి స్థలం, కుళాయి కనెక్షన్, పొలం సర్వే, రేషన్ షాపు సంబంధిత సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

# అంగన్‌వాడీలకు టీచర్ హోదా కల్పించాలి

**ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్–మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి**



డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వేమేశ్వరి, జ్యోతిరాణి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా టీచర్ హోదా కల్పించాలని ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్–మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి కోరారు. విజయవాడలోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సోమవారం డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని కలిసి ఫోరం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐ. వేమేశ్వరి, టి.జ్యోతిరాణి వినతిపత్రం అందజేశారు. ప్రీ–స్కూల్ పిల్లలకు ఇచ్చే ఆహారం నాణ్యత పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, అనారోగ్య పరిస్థితుల్లో అంగన్‌వాడీలకు మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు జ్యోతి రాణి మాట్లాడుతూ ఫోరం వినతిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందివారని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని చెప్పినట్లు తెలిపారు. అదేవిధంగా తమ పరిధిలో ఉన్న ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ చొరవతో కృషి చేస్తామనని చెప్పినట్లు చెప్పారు.

# ఆశలు అడిగే జీవోలు తీసుకురాలేం..

- ప్రత్తిపాడులో ముదిరిన ఏఎన్ఎంలు, ఆశల మధ్య వివాదం
- ఆశ వర్కర్లపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు
- సమీక్షలకు కూడా జీఓ(ప్రభుత్వ ఉత్తర్వులు) అడుగుతున్నారని ఆవేదన
- రిజిస్టర్ల నిర్వహణ కూడా లేదని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఆరోపణ



తహసీల్దార్‌కు ఆశ కార్యకర్తలపై ఫిర్యాదు చేస్తున్న ఏఎన్ఎంలు, సీహెచ్‌వో స్వర్ణలత

ప్రత్తిపాడు: ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల మధ్య వివాదం ముదిరింది. ఇన్నాళ్లూ వైద్య ఆరోగ్య శాఖకే పరిమితమైన ఈ ఆధిపత్య పోరు ఇప్పుడు రచ్చకెక్కింది. ఆశ వర్కర్లు అడిగే జీఓ(ప్రభుత్వ ఉత్తర్వులు)లు తాము తీసుకుని రాలేమని, వాళ్ల వల్ల తామంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ అంటూ ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక తలుపు తట్టారు. వివరాల్లోకి వెళితే కొంతకాలంగా మండలంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు అనేక సందర్భాల్లో ఒకరిపై ఒకరు బహిరంగంగానే విమర్శలూ చేసుకుంటూ వస్తున్నారు. తాజాగా ఆశల వైఖరిని నిరసిస్తూ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు సోమవారం సీహెచ్‌వో స్వర్ణలత నేతృత్వంలో మీ కోసంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రత్తిపాడు కోలొకేటెడ్ పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 22 మంది ఆశ కార్యకర్తలు ఉన్నారని, వారితో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఏ ఒక్క ఆశ కార్యకర్త కూడా రిజిస్టర్లు నిర్వహించడం లేదని, హాజరు రిజిస్టరులో సంతకాలు చేయడం లేదని, సెలవులకు లీవ్ లెటర్ ఇవ్వడం వంటివి చేయడం లేదని చెప్పున్నారు. కనీసం ఏఎన్ఎంలకు సెలవు సమాచారం కూడా తెలియజేయడం లేదని, సమీక్ష సమావేశాలకు రమ్మంటే టీఏ, డీఏలు, జీవోలు అడుగుతున్నారని వాపోయారు. ప్రత్తిపాడులో నజీరా అనే ఆశ కార్యకర్త పది రోజులు సెలవు అడిగి, 22 రోజుల నుంచి విధులకు రావడం లేదని పేర్కొన్నారు. జాతీయ స్థాయి కార్యక్రమాలకు సైతం ధర్నా ఉందని చెప్పి వెళ్లిపోతున్నారని పేర్కొన్నారు. అసలు విధులకు రాని వారికి కూడా నెలనెలా పూర్తి జీతం చెల్లిస్తున్నారని చెప్పారు. వాళ్లు అడిగే జీవోలన్నీ తీసుకురావడం సాధ్యమయ్యే పని కాదని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు గగ్గోలు పెట్టారు. ఫిర్యాదును సంబంధిత శాఖ అధికారులకు పంపడం జరుగుతుందని తహసీల్దార్ కె.రవిబాబు తెలిపారు. కాగా కొద్ది రోజుల కిందట ఏకంగా మా దాక్టరెవరో చెప్పండంటూ ఆశ కార్యకర్తలు పీహెచ్‌సీ ముందు బైఠాయించిన సంగతి తెలిసిందే. కాగా వీరిచ్చిన ఫిర్యాదుపై సీహెచ్‌వో సైతం సంతకం చేసి ఇవ్వడం విశేషం.

### కరాటే చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన నగర విద్యార్థిని



గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలో ఆదివారం జరిగిన జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో హిందూ ఇంజినీరింగ్ కళాశాల డిప్లొమా ఈఈఈ మొదటి సంవత్సర విద్యార్థిని దాసరి శ్రీసాహితి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ చిన్నం సుబ్బారావు తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో సోమవారం జరిగిన విద్యార్థిని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అండర్–40 కేటగిరీలో పాల్గొన్న 300 మంది అభ్యర్థులతో పోటీ పడిన తమ విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ పి.ఐజాక్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడా నైపుణ్యాల్ని వెలికితీసేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, ఈఈఈ విభాగాధిపతి ఐతపు నాగాంజనేయులు, ఫిజికల్ డైరెక్టర్ రవి పాల్గొన్నారు.